
# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం 20 ఫిబ్రవరి 2025 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 8



## అసంక్రమిత వ్యాధుల
# స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.గోపాల్‌రావు



వివరాలు 2లో

## పార్టీల చూపు..
# బీసీల వైపు




- స్థానిక సంస్థల్లో ఓటు బ్యాంకు తిప్పలు
- కులగణన, వర్గీకరణ అంశాలతో కాంగ్రెస్
- లైన్ ఏదైనా అన్ని పార్టీల దృష్టి బీసీలపైనే...

**కోదాడ, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** రాష్ట్రంలో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పుడు బీసీ అంశంపైనే దృష్టి పెట్టాయి.రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే వివరాలను వెల్లడించడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇది కీలకమైన అంశంగా మారింది. దేశంలోనే ఏ రాష్ట్రం చేయలేని పనిని చేశామంటూ అధికార కాంగ్రెస్ అనుకూలంగా మల్చుకునే ప్రయ త్నం చేస్తున్నది. విపక్ష బీఆర్ఎస్ మాత్రం బీసీ జనాభా లెక్కలు తప్పుల తడకగా ఉన్నాయని ప్రభుత్వాన్ని విమర్శించేందుకు అస్త్రంగా వాడుకోవాలనుకుంటున్నది. బీజేపీ గతంలోనే బీసీలపై కన్నేసి తమ పార్టీ గెలిస్తే బీసీ అభ్యర్థే ముఖ్యమం త్రి అవుతారని ప్రకటించింది. ఆయా పార్టీల దృష్టి వేర్వేరుగా ఉన్నా అవన్నీ బీసీల చుట్టే తిరుగుతున్నాయి.

**కులగణన, నాలుగు పథకాలపై ఫోకస్:** శాస్త్రీయంగా, సమగ్రంగా, పకడ్బందీగా కులగణనను నిర్వహించి బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓసీల లెక్కలు తేల్చామని ప్రభుత్వం అసెంబ్లీ వేదికగానే ప్రకటించింది. స్వతంత్ర భారతదేశంలో ఇలాంటి కసరత్తు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందని చెప్పుకుంటున్నది. ఈ లెక్కలు సంక్షేమ, అభివృద్ధి పనులకు రోడ్ మ్యాప్ ఉంటాయని సీఎం రేవంత్ ప్రకటించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా

మిగతా2లో



## బీఆర్ఎస్‌లో చేరిన పలువురు
# కాంగ్రెస్ నేతలు

- కాంగ్రెస్ పాలనపై విరక్తిచెందే పార్టీ మారుతున్నామంటున్న నేతలు
- కండువాగప్పి పార్టీలోకి స్వాగతం పలికిన దశరథ్‌నాయక్

వివరాలు 2లో

## ఫామ్‌హౌస్‌లో పడుకున్న కేసీఆర్‌కు
# అభివృద్ధి, సంక్షేమం ఎక్కడ కనిపిస్తుంది

### టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్

**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్) :** ఫాం హౌస్ కి పరిమితమైన కేసీఆర్ కు ప్రతిపక్ష హోదా ఎందుకు అని, ఫామ్ హౌస్ లో పడుకున్న మీకు కాంగ్రెస్ అభివృద్ధి,సంక్షేమం ఎక్కడ కనిపిస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో బుధవారం టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్మా ట్లాడుతూ కేసీఆర్ కుంభ కర్ణుడి నిద్రలేచి బయల్దేరాడని, సీఎంపైన, మంత్రుల మీద నోరు పారేసుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. తెలంగాణ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పిన కేసీఆర్ తీరు మారలేదని, అధికారం కోసం

మిగతా2లో





## ఫామ్‌హౌస్‌లో పడుకున్న కేసీఆర్‌కు అభివృద్ధి, సంక్షేమం ఎక్కడ కనిపిస్తుంది

(మొదటిపేజీ తరువాయి..)
గుంట నక్కలా కేసీఆర్ ఎదురుచు చూసిన ఫలితం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఓపికను పరీక్షించ వద్దని హెచ్చరిస్తున్నామని, తెలంగాణలో ప్రజాపాలన నడుస్తోందన్నారు. కేసిఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందని, బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిపోయిన సీఎంఆర్ఎఫ్,చెక్కుల బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కాంగ్రెస్ అభివృద్ధి,సంక్షేమం చూసి ఓర్వలేక కేసిఆర్ అండ్ కో ఓర్వలేకపోతోందన్నారు. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయ ముఖ చిత్రంలో బీఆర్ఎస్ ఉండదని జోస్యం చెప్పారు. కారు పార్టీకి ఎన్ని రిపేర్లు చేసిన ఫలితం శూన్యమని ఎద్దేవా చేశారు.కేసిఆర్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని, పార్టీ ఫిరాయింపు ల గురించి మాట్లాడానికి కేసీఆర్ కు సిగ్గు ఉండాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్,బీజేపీ కుట్రలను తిప్పి కొట్టి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీ తో గెలిపించాలన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి మోసం చేసిన బీజేపీ కి పార్టీకి ఓటేస్తారా.. ఏడాదిలో 56 వేలు ఉద్యోగాలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తారా తేల్చుకోండని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి క్రిష్ణారావు, జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీ, మాజీ ఎమ్మెల్సీ లు జీవన్ రెడ్డి, అరికెల నర్సారెడ్డి, వర్ధన్నపేట్ ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ రెడ్డి, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు

- కాంగ్రెస్ పాలనపై విరక్తిచెందే పార్టీ మారుతున్నామంటున్న నేతలు
- కండువాగప్పి పార్టీలోకి స్వాగతం పలికిన దశరథ్‌నాయక్



**మహేశ్వరం, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్) :** కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలంలోని గోవిందాయి పల్లి తండా గ్రామపంచాయతీ నుండి పలువురు యువ కాంగ్రెస్ నేతలు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీ లో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ యువకులను కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ కండువా కప్పి పార్టీలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి పాలన నచ్చక బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ లో చేరిన వారిలో కేతావత్ గణేష్, పాత్లావత్ జైపాల్, కెతావత్ గోపాల్, సభావత్ మునిందర్, సభావాత్ దశరథ్, సభావత్ నరి, సభావర్ మల్లేష్ లను స్థానిక నాయకులతో కలిసి పార్టీలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ ఎంపిటిసిలు లచ్చిరాం నాయక్ ప్రియా రమేష్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ రెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ నాయకులు సంతోష్ కుమార్ గోపాల్ అంజి హంజెద్ శివరాం దాస్య గోపాల్ శ్రీకాంత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం.. ప్రజలు సహకరించాలి

**కోదాడ/అనంతగిరి, ఫిబ్రవరి 19( నినాదం న్యూస్):** అనంతగిరి మండలం శాంతినగర్ సబ్ స్టేషన్ లో 11 కెవి బొజ్జ గూడెం ఫీడర్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అనంతగిరి మండల ఏఈ సీతారామయ్య తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు బొజ్జ గూడెం తండ గ్రామంలో చెట్లు నరికే కార్యక్రమం ఉంటుందని ప్రజలు రైతుల సహకరించాలని కోరారు.

# పార్టీల చూపు బీసీల వైపు..

**(మొదటిపేజీ తరువాయి..)**
బీసీలకు 42% రి జర్వేషనన్ను రాజకీయంగా కల్పిస్తామని, లీగల్ గా చిక్కులు వచ్చినా పార్టీపరంగా న్యాయం చేసి మాటకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం గత నెల 26న లాంఛనంగా ప్రకటించిన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ.. వీటిని కూడా అనుకూలం గా మల్చుకుని పొలిటికల్ మైలేజ్ పొందాలని ప్రయత్నిస్తున్నది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు వివిధ స్థాయిల్లోని ప్రజా ప్రతినిధుల ద్వారా ప్రజల్లోకి కులగణనతో పాటు నాలుగు పథకాలను విస్తృతంగా తీసుకెళ్ళేందుకు సంస్థా గతంగా దిశానిర్దేశం చేయబోతున్నది.

**ప్రభుత్వంపై బిఆర్ఎస్ మాటల దాడి...**
అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేజారిపోవడం, పార్లమెంటు ఎన్నికల్లో ఊహించని చేదు అనుభవాన్ని ఎదుర్కోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సకల ప్రయత్నాలు చే స్తున్నది. ప్రభుత్వం చెప్పుకుంటున్న కులగణన తప్పుల తడక అని బీసీ నేతల ద్వారా విమర్శలు గుప్పిస్తున్నది. ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేయాలనుకుంటున్నదని, అందుకే తక్కువ చేసి చూపిస్తున్నదని, 42% రిజర్వేషన్ హామీ నుంచి పక్కకు తప్పుకోవాలనుకుంటున్నదని ఆరోపిస్తు న్నారు. కులగణన ప్రక్రియ కాంగ్రెస్కు అడ్వాంటేజ్ మారకుండా తనదైన శైలిలో బీసీలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది.

**బీసీ సీఎం ఎజెండాతో బీజేపీ పక్కా ప్లాన్:**
అసెంబ్లీ ఎన్నికలకంటే ముందే బీసీ డిక్లరేషన్ ను ప్రకటించిన కాంగ్రెస్... స్థానిక సంస్థల ఎన్నిక ల్లో బీసీలకు 42% రిజర్వేషన్ హామీతో పాటు కులగణన చేపట్టనున్నట్లు స్పష్టం చేసింది. దాదాపుగా అదే సమయంలో బీజేపీ.. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తినే సీఎం చేస్తామని ప్రకటించింది. బీసీలకు పార్టీ ప్రాధా న్యం ఇస్తుందని, స్టేట్ చీఫ్ బాధ్యతలను బండి సంజయ్ (బీసీ)కి అప్పజెప్పిందని, ప్రధాని కూడా బీసీ కులానికి చెందినవారేనని ఉదహరించింది. రాష్ట్రంలో బీసీ జనాభా ఎక్కువగా ఉండడంతో ఆ ఓట్ బ్యాంక్ పాలిటిక్స్ వ్యూ హాన్ని రూపొందించుకున్నది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీసీ రాగాన్ని ఎత్తుకోవాలని నిర్ణయించింది.

**గత స్థానిక సంస్థలలో సత్తా చాటిన బీసీలు...**
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2019లో చివరిసారిగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొత్తం సర్పంచ్ పదవుల్లో 40శాతం బీసీ సామాజికవర్గాల నాయకులు గెలుపొందారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,730 గ్రామ పంచాయతీలకు 687 పంచాయతీల్లో సర్పంచ్లుగా బీసీనేతలు గెలుపొందారు. 497 గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులు బీసీలకే రిజర్వ్ కాగా, మరో 190 జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులు పోటీపడి గెలు

**జనరల్ స్థానాల్లోనూ..,**
స్థానిక సంస్థల్లో అధికసంఖ్యలో సీట్ల కైవసం గత ఎన్నికల్లో సత్తా చాటిన బీసీ నాయకులుపొందారు. జనరల్ స్థానాల్లో నల్లగొండ జిల్లాలో 79. మంది, సూర్యాపేటలో 52 మంది, యాదాద్రి భువన గిరి జిల్లాలో 59 మంది సర్పంచులుగా విజయం సాధించారు. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోనే జనర లీ స్థానాల్లో ఎక్కువమంది బీసీలు సర్పంచ్లుగా గెలు పొందారు.

**ఎంపీటీసీ స్థానాల్లో 35శాతం దక్కించుకున్న బీసీలు**
ఉమ్మడి జిల్లాలో మండల పరిషత్ ప్రాదేశిక నియో జకవర్గ స్థానాల్లోనూ జనరల్ కేటగిరీలో బీసీలు గణనీ యంగా సీట్లు దక్కించుకున్నారు. మొత్తం సీట్లలో35శాతం బీసీలు గెలుపొందారు. మొత్తం ఉమ్మడి జి ల్లాలో 718 ఎంపీటీసీ స్థానాలకు 251 మంది బీసీ నాయకులు విజయం సాధించారు. ఇందులో బీసీ రిజ ర్వేషన్ స్థానాలు 161 అయితే, మిగిలిన 90 జనరల్ సీట్లలో బీసీలు గెలుపొందారు. జనరల్ కేటగిరీలోని ఎంపీటీసీ స్థానాల్లో అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో 50మంది, నల్లగొండలో 28 మంది, యాదాద్రి భువన గిరిలో 12మంది ఎంపీటీసీగా గెలిచారు.

**జడ్పీటీసీ స్థానాల్లో 25శాతం సీట్లలో విజయం**
జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులుగా మాత్రం బీసీనాయకులుజనరల్ స్థానాల్లో పరిమితంగానే పోటీచేశారు. మండల స్థాయిలో నియోజకవర్గ ముండడం, ఖర్చు భారీగా పెట్టాల్సిరావడం, పార్టీల్లో సైతం ఓసీ అభ్యర్థులను నిలువ రించి బీఫాంలు దక్కించుకోలేకపోవడం వంటి కారణాలతో జడ్పీటీసీలుగా పోటీచేసే విషయంలో రిజర్వ్ స్థానాల్లో తప్ప జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులు దూకుడు ప్రదర్శించలేకపోయినట్లు రాజకీయపార్టీల నేతలు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిశీలిస్తే మొత్తం 71 జడ్పీటీసీలకు గాను బీసీ అభ్యర్థులు 25శాతం మేర అంటే 18సీట్లలో విజయం సాధించారు. బీసీ రిజర్వ్ సీట్లు 11కి అదనంగా జనరల్ సీట్లలో మరో ఏడుగురు అభ్యర్థులు గెలుపొందారు. అదేవిధంగా జనరల్ స్థానమైన త్రిపురా రంలో ఎస్టీ అభ్యర్థి భారతీనాయక్ విజయం సాధించడం గమనార్హం. ఈ క్రమంలోని రాబోవు స్థానిక సంస్థలలో కూడా బీసీలు తమకు రావలసిన వాటా తమకు ఇవ్వాలని తమ సత్తా ఏంటో చాటుతామని పేర్కొంటున్నారు.



**కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి**
**– బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సిరికొండ శ్రీనివాస్**
కులగణన సర్వేకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. సర్వేలో పాల్గొనని బీసీ కులస్తులు తప్పనిసరిగా సర్వేలో పాల్గొనాలి. బిసి కులస్తుల సత్తా ఏంటో చాటాలి.బీసీ కుల గణనపై ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా చట్టపరమైన అవరోధాలు తలెత్తకుండా చూడాలి. పార్లమెంటుకు నివేదించే బీసీ కులగ ణన జనాభా లెక్కలు శాస్త్రీయ బద్ధంగా, న్యాయబద్ధంగా శాసన ప్రక్రియ ద్వారా పకడ్బందీగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.తమిళనాడు తరహాలోనే వ్యవహరించి రిజర్వేషన్లకు కావాల్సిన అన్ని ప్రక్రియ లను సంపూర్ణంగా అమలు చేసే దిశగా వెళ్లాలని, లేనిపక్షంలో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ఇచ్చిన ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన ప్రక్రియను ప్రారంభించడం హర్షనీయమని ఆ కుల గణన నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేస్తేనే బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుంది.

## అసంక్రమిత వ్యాధుల స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.గోపాల్‌రావు**

**ములుగు ప్రతినిధి, (నినాదం):** జిల్లాలో ఈ నెల 20 నుంచి అసంక్రమిత వ్యాధుల స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్, అసంక్రమిక వ్యాధుల కోఆర్డినేటర్స్, ఎన్ హెచ్ ఎం డిస్టిక్ డాటా మేనేజర్స్‌తో అసంక్రమిక వ్యాధుల ప్రత్యేక డ్రైవ్ గురించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ మిడ్లేవల్లి హెల్త్ ప్రొవైడర్స్, ఆరోగ్య కార్యకర్తలతో ఆయన జూమ్-మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుండి మార్చి 31 వరకు అసంక్రమిత వ్యాధులైన మధుమేహం, హైపర్ టెన్షన్, క్యాన్సర్లపై 30 ఏండ్ల పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని కోరారు. ఇప్పటి వరకు 76 శాతం స్క్రీనింగ్ చేశామని మిగిలిన 24శాతం లక్ష్యాన్ని ప్రత్యేకమైన డ్రైవ్ లతో వందశాతం చేయాలని డాక్టర్లకు మిడిల్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్కు ఆరోగ్య కార్యకర్తలకు తెలిపారు. ఎవరైతే అలసత్వంతో వందశాతం లక్ష్యాన్ని చేయరో వారిపై శాఖా పరమైన చర్యలు ఉంటాయని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు ఆరోగ్యం, వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రణధీర్, ఎన్ సి డి కోఆర్డినేటర్ రెడ్డి, డిస్టిక్ డాటా మేజర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



## చట్టాలు.. ఉచిత న్యాయంపై అవగాహన ఉండాలే...

- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేందర్




**ములుగు ప్రతినిధి, (నినాదం):** విద్యార్థులు చట్టాలు, ఉచిత న్యాయంపై అవగాహన కల్గి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో గోవిందరావుపేట మండలం ప్రాజెక్టునగర్ గ్రామంలో గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మోటర్ వెహికిల్ చట్టం, విద్యాహక్కు చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టాలు, బాలకార్మిక చట్టాలు, ఆస్థిహక్కు చట్టం, ఫోక్సో చట్టాల గురించి తెలుసుకుని అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు బాధ్యతయుతంగా గౌరవ మర్యాదలతో మెలగాలన్నారు. ఉచిత న్యాయం ఎలా లభిస్తుందని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పలు చట్టాలు, ఉచిత న్యాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్ కుమార్, ఏజిపి బాలుగు చంద్రయ్య, ప్రధానోపాధ్యాయులు ఏ. చేరాలు, ఏ. పద్మావతి, స్వరూప, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు శ్రేణులు నరేందర్ రెడ్డి గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



**కరీంనగర్, ఫిబ్రవరి 19(నినాదం న్యూస్ )** సిపిఐ బలపరుస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని మెదక్, కరీంనగర్, నిజామాబాద్,అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించేందుకు కమ్యూనిస్టు శ్రేణులు పనిచేయాలని సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో గురువారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐనగర కార్యదర్శికసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నరేందర్ రెడ్డి ట్యూషన్ టీచర్ నుండి విద్యావ్యవస్థలను నెలకొల్పే స్థాయికి ఎదగాడంటే తన యొక్క ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లి ఈరోజు ఉత్తర తెలంగాణలోనే పేరు ప్రఖ్యాతలు సంపాదించాడని అన్నారు. నరేందర్ రెడ్డి ని గెలిపిస్తే రాష్ట్ర ప్రభుత్వంప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకై అహర్నిశలు పాటుపడతాడని పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ల విడుదలకై కృషి చేస్తారని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకువచ్చేందుకు కృషి చేస్తారని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వంతో మాట్లాడి నూతన నియమానకాలకై ప్రయత్నించే వ్యక్తి అని వారు అన్నారు. నరేందర్ రెడ్డి గెలవడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం పాటుపడతారని వారు తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో నూతన ఒరవడి సృష్టించడానికి కుల మతాలకతీతంగా సబ్బండ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఉత్తర తెలంగాణ ప్రాంతాన్ని ఉద్యోగ అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దడం కోసం సమాజసేవకుడిగా అన్ని వేళల్లో అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారం కృషి చేస్తాడని అందరికీ అందుబాటులో ఉండే నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు.
ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్న బిజెపి పాలకులు దేశంలో ఖాళీగా ఉన్న కోట్ల ఉద్యోగాలను భర్తీ చేయడంలో పూర్తిగా విఫలం చెందారని దేశంలో నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్నారని, ఉత్తర తెలంగాణలో ట్రిబుల్ ఐటీ, ఐఐఎం,నవోదయ, సైనిక్ లాంటి విద్యాసంస్థల ను తీసుకురావడంలో ఘోరంగా విఫలం చెందాలని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యలు పట్టించుకోని బిజెపిని ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కరపత్రం విడుదల కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజుగౌడ్ ,న్యాల పట్ల రాజుగౌడ్ నాయకులు నల్లగొండ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రెప్పపాటులో.. పంట నగదు దొంగలించిన దొంగలు

- **రైతు నుండి లక్ష 77వేలు కొట్టేసిన దొంగలు**
- **టీవీఎస్ పై ఇంటికి వెళ్తున్న రైతు**
- **రైతును కొట్టి డబ్బులు లాకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు**
- **అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామ శివారులో ఘటన**
- **బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు**

**కోదాడ/అనంతగిరి, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** ఆరుగాలం కష్టపడి పండించిన పంట డబ్బులను కళ్ళముందే దోచుకెళ్లారు. చేసేదేమీ లేక రైతు కన్నీరు మున్నీరుగా వినిపిస్తూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే మంగళవారం అనంతగిరి మండలం గొండ్రియల గ్రామానికి చెందిన కొండ బాలు పుల్లయ్య తను పండించిన పంట యొక్క వడ్లను వచ్చిన 1,77,817 రూపాయలను ఖమ్మం జిల్లా నేలకొండపల్లి గ్రామం నుండి తీసుకొని తన స్వగ్రామం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గొండ్రియల గ్రామానికి మోటార్ సైకిల్ పై బయలుదేరాడు. మార్గమధ్యం శాంతినగర్



గ్రామ శివారులో మధ్యాహ్నం సమయంలో తన వెనుక వైపునే స్కూటీపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు అడ్డగించి బెదిరించి చేతులతో కొట్టి తన వద్ద ఉన్న డబ్బులను లాక్కుని పోయారు. దీంతో రైతు కన్నీరు మున్నీరుగా వినిపిస్తూ స్థానిక అనంతగిరి పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. కష్టపడి చెమటోడ్చి పండించిన పంట చేతికి నగదు రూపంలో వచ్చి దొంగల పాలు కావడంతో రైతు ఆవేదన వర్ణాతీతంగా మారింది.

# కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్ కీలకం



**నర్సంపేట, ఫిబ్రవరి 19(నినాదం) :** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్ విభాగం కీలకమని నర్సంపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి నేతృత్వంలో ఈనెల 16నుండి 18వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్ లోని మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని ఓ రిసార్ట్ లో జరిగిన సోనియమ్మ కుటీరం యువ క్రాంతి బునియాది శిక్షణ తరగతుల సమావేశానికి హాజరు కావడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్బంగా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్ మాట్లాడుతూ తనకు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అవకాశాన్ని కల్పించి, మూడు రోజుల పాటు హైదరాబాదులో జరిగిగే శిక్షణ తరగతుల్లో పాల్గొనే గొప్ప అవకాశాన్ని అందించిన జనహృదయనేత నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత నర్సంపేట శాసన సభ్యులు గౌరవ పెద్దలు దొంతి మాధవరెడ్డికు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్ చాలా కీలకమని, యూత్ కాంగ్రెస్ లో ఎవరైతే క్రియాశీలకంగా సమర్థవంతంగా చురుగ్గా పని చేస్తారో వారికి కాంగ్రెస్ పార్టీలో రాజకీయంగా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ రాజకీయాల్లో ఉన్న చాలా మంది ప్రముఖులు యూత్ కాంగ్రెస్ లో పని చేసిన వారేనని, శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పలువురు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మాట్లాడిన మాటలని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రజా పాలన అందిస్తున్న పథకాలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే దిశగా యూత్ కాంగ్రెస్ నాయకులు అడుగులు వేయాలని సూచించారు. జాతీయ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ సురభి దివెది జీ, జాతీయ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సైద్ ఖాలీద్ అహ్మద్ జీ, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి గార్ల చేతుల మీదుగా శిక్షణ తరగతుల సర్టిఫికెట్, యూత్ కాంగ్రెస్ బ్యాగ్, బహుమతులు తీసుకోవడం జరిగిందని సందీప్ తెలిపారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్

# జయంతి వేడుకలు



**మంథని ఫిబ్రవరి19 (నినాదం న్యూస్):** హిందూ ఆరాధ్య దైవం చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మంథని పట్టణంలోని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు . ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయంగా అనేక యుద్ధాలు చేసి 300 కోటలకు పైగా స్వాధీనం చేసుకుని మొగలులను సుల్తాన్లను నిజాములను ఓడించి అతిపెద్ద హిందూ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసిన చత్రపతి బిరుదాంకితుడైన శివాజీ మహారాజ్ అందరికీ ఆదర్శప్రాయుడని కొనియడుతూ ఆ మహనీయుడి పట్టుదల ప్రతి ఒక్కరి భారత యువతలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపాక సత్య ప్రకాష్ ,జిల్లా కౌన్సిల్ మెంబర్ బోగోజు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి పోతర వేణి క్రాంతికుమార్ ,అసెంబ్లీ కో కన్వీనర్ నాంపల్లి రమేష్ ,కమాన్పూర్ మండలం ఇంచార్జ్ చిలువేరి సతీష్ ,సీనియర్ నాయకులు నార మల్ల కృష్ణ, బొల్లంపల్లి లక్ష్మణ్, టౌన్ జనరల్ సెక్రెటరీ సామల అశోక్ ,టౌన్ ఉపాధ్యక్షులు శ్రావణ్ ,నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

**ముత్తారంలో చత్రపతి మహారాజ్ వేడుకలు.**

ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో బుధవారం రోజున ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా మండలం ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం,పూలమాల చేసి,ఓడేడు గ్రామం నుంచి అడవి శ్రీరాంపూర్ గ్రామం మీదుగా ముత్తారం గ్రామం నుండి తిరిగి ఓడేడు గ్రామం వరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండలం ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ఆర్టీవో ఆఫీస్‌ను సందర్శించిన పెద్దపల్లి జిల్లా ఆర్టీఏ

- **నాన్ అఫీషియల్ మెంబర్ మంథని సురేష్**
- **ఘన స్వాగతం పలికిన ఆర్టిఏ కార్యాలయ సిబ్బంది**

**పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి19 (నినాదం) :** జిల్లా ఆర్టిఏ నాన్ అఫీషియల్ మెంబర్ మంథని సురేష్ బుధవారం ఆర్టీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఆర్టీవో రంగారావు ను, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లను, సిబ్బందిని మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీవో ఆఫీస్ స్థల సేకరణకు 7 ఎకరాల అవసరం ఉందని,అందుకు రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ మరియు శాసనసభ వ్యవహారాల మంత్రి మంత్రుల దృష్టికి,పెద్దపల్లి శాసనసభ్యుల దృష్టికి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజల్లో రవాణా శాఖ పై అవేర్నెస్ కార్యక్రమాలు,ప్రమాదాల నివారణకు కృషి చేయడం జరుగుతుందని తెలపడం జరిగింది. తనకు స్వాగతం పలికి మర్యాద పూర్వకంగా మాట్లాడిన ఆర్టిఏ కుటుంబ సభ్యులందరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఆర్టిఏ మెంబర్ మంథని సురేష్ తో పాటు శ్రావణ్,నాగరాజు,సందీప్, ఉన్నారు.




# చత్రపతి శివాజీ మహారాజ్ ఓ వీరుడు

- ఎల్లంపేటలో ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు
- నేటి యువత చత్రపతి శివాజీ మహారాజ్ ను ఆదర్శంగా తీసుకోవాలి
- చత్రపతి శివాజీ మహారాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో



**డోర్నకల్ /మరిపెడ ఫిబ్రవరి 19(నినాదం న్యూస్) :** చరిత్రలో గొప్ప యోధులు, సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేర్లలో ఛత్రపతి శివాజీ పేరుకు ఎంతో ప్రత్యేకత ఉంది.ఆయన పేరు ఉంటే హిందూ మతం ఉత్సాహంతో ఉప్పొంగిపోతుంది. చిన్నతనంలోనే మొఘలుల దాడులలో హిందూ మతం అంతరించి పోతుందని, వారితో యుద్ధంలో ఓడిపోయి అందరూ చేతులెత్తేసిన వేళ శివాజీ మహారాజు మండే నిప్పు కణికలా దూసుకొచ్చాడు. మొగల్ రాజులతో ఎంతో వీరోచితంగా పోరాడాడు. అందుకే హిందూమతాన్ని కాపాడిన ఘనత ఒక్క మరాఠా మహారాజు శివాజీకే దక్కుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.అందుకే ఆ యోధుడి జన్మదినోత్సవాన్ని భారతదేశ వ్యాప్తంగా ఒక వేడుకలా జరుపుకుంటారు. ముఖ్యంగా మహా రాష్ట్రలో ఒక పండుగలా నిర్వహిస్తారు.1674లో శివాజీకి చక్రవర్తిగా పట్టాభిషేకం జరిగింది. అంతటి గొప్ప వీరయోధుడి 395వ జయంతి సందర్భంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఎల్లంపేట గ్రామపంచాయతీలో చత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చత్రపతి శివాజీ యూత్ అధ్యక్షులు మానేపల్లి ఉమేష్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్నటువంటి భగవద్గీత, రామాయణం, నీతి కథలు, ఉపనిషత్తులు చెప్పడం ద్వారా మంచి స్వభావాన్ని రూపొందించుకోవడం జరిగిందన్నారు.చత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప వీరుడని అతి చిన్న వయసులోనే క్రీస్తు శకం 1630లో ఫిబ్రవరి 19వ తేదీన మహారాష్ట్ర పూణే జిల్లాలో ఉన్న జనార్‌లోని శివనీర్ కోటలో జిజియాబాయ్, షహాజీ దంపతులకు శివాజీ జన్మించారు.ఆయన తల్లి క్షత్రియ వంశీయురాలు.శివాజీ పుట్టకముందే పుట్టిన వారంతా చనిపోవడంతో, ఆమె శివపార్వతులను పూజించగా శివాజీ క్షేమంగా ఉన్నాడు.దీంతో ఆయనకు శివాజీ అనే పేరు పెట్టారు.శివాజీ మహారాజ్ కన్న తల్లి దగ్గరే పరమత సహనం,మహిళల పట్ల గౌరవంగా ఉండటం నేర్చుకున్నాడు.అతి చిన్న వయసులోనే తను పుట్టిన భూమికి మేలు చేయాలని,ప్రజలతో ఎలా నడుచుకోవాలో శివాజీకి జిజియబాయి పూస గుచ్చినట్టు వివరించారు.మరోవైపు తన తండ్రి పూణేలో జాగీరుగా ఉండేవారు.తన తండ్రి దగ్గర నుంచి యుద్ధ విద్యలు నేర్చుకున్నాడు.రాజనీతి మెళకువలు నేర్చుకుంటూ..తన తండ్రి ఓటముల గురించి అధ్యయనం చేసేవాడు. అప్పుడే సరికొత్త యుద్ధ తంత్రాలను నేర్చుకున్నాడు.శివాజీ 17వ ఏటలోనే కత్తి పట్టాడు.అంతేకాదు వెయ్యి మంది సైన్యంతో వెళ్లి బీజాపూర్‌కు చెందిన తోర్నా కోటను స్వాధీనం చేసుకున్నాడు.ఆ తర్వాత మూడేళ్లలోపే రాజ్‌ఘడ్,కొండన ప్రాంతాలను ఛేజిక్కుంచుకుని పూణే ప్రాంతాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకున్నా ఓటమి తప్పదు అనిపిస్తే యుద్ధం నుంచి తప్పుకోవాలి.. అనుకూల సమయాన్ని చూసి దాడి చేసి గెలవాలి.ఈ సూత్రాన్ని శివాజీ ఎక్కువగా నమ్మేవారట.ఇదే శివాజీ పాటించే యుద్ధ తంత్రం దీన్నే గెరిల్లా యుద్ధం అంటారు.శివాజీ మహారాజు ముస్లిముల దురాక్రమణను వ్యతిరేకించినప్పటికీ,తన రాజ్యంలో లౌకికవాదాన్ని పాటించారు.అన్ని మతాల వారినీ సమానంగా ఆదరించారు.ఇతర మతాల వారిని కూడా గౌరవించారు.తన సైన్యంలో..ఛత్రపతి శివాజీ స్నేహితుల్లో చాలా మంది మహమ్మదీయులు ఉన్నారు.తన సైనిక వ్యవస్థలో కూడా ఎందరో ముస్లింలకు సముచిత స్థానం కల్పించారని,శివాజీ యుద్ధ తంత్రాలు శత్రువులకు అస్సలు అంతుబట్టని విధంగా ఉండేవని తిరుగులేని యుద్ధ వ్యూహాలను అనుసరించడమే శివాజీ అసమాన ప్రతిభకు నిదర్శనం. పటిష్టమైన సైన్యంతో పాటు నిఘా వ్యవస్థను కూడా కలిగి ఉండటమే కాకుండా,ఆధునిక యుద్ధ తంత్రాలను ఉపయోగించారన్నారు.చత్రపతి శివాజీ మహారాజ్ నడిచిన మార్గంలో నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలన్నారు.చత్రపతి శివాజీ మహారాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు..ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కుదురుపాక విష్ణు, అలవాల శ్రీధర్,చత్రపతి శివాజీ మహారాజ్ యూత్ అసోసియేషన్ కార్యదర్శి దుండిగల సాయి, ఉపాధ్యక్షులు ఊరుగొండ మహేష్, బక్క రాములు,గుండె దశరథ్,బత్తం అశోక్,కొంపెల్లి నాగరాజు,లింగయ్య, గండి చిన్న సాయి,పెద్ద సాయి,గండి రాజు,చత్రపతి శివాజీ అభిమానులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు...

# మాజీ కౌన్సిలర్ భర్త దారుణ హత్య



**భూపాలపల్లి ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ నాగవెల్లి సరళ భర్త నాగవెల్లి రాజలింగమూర్తి బుధవారం సాయంత్రం పట్టణ నడిబొడ్డులో దారుణ హత్యకు గురయ్యారు. స్థానికులు పోలీసులు తెలిపిన కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న రాజలింగమూర్తి భార్య సరళ గత పాలకవర్గంలో 15వ వార్డు కౌన్సిలర్ గా కొనసాగారు. కాగా రాజలింగమూర్తి గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక కార్యకర్తగా ఉంటూ పలు భూ వివాదాలు, రాజకీయ వివాదాలలో తలదురుస్తూ అందరికీ సుపరిచితునిగా ఉన్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై రెడ్డి కాలనీ లోని తన నివాసానికి వెళుతుండగా అంబేద్కర్ చౌరస్తాకు అతి సమీపంలో టీబీజీకే కార్యాలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి రాజలింగమూర్తి వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం కత్తులతో విచక్షణ రైతంగా దాడి చేయడంతో తలకు పొట్టలో తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడు అపస్మారక స్థితిలోకి వెళ్లడం గమనించిన దుండగులు అక్కడి నుండి పరారయ్యారు. విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారాన్ని అందివ్వడంతో పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని తీవ్ర గాయాల పాలైన రాజలింగమూర్తిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకొని చేరుకునే లోపే రాజలింగమూర్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు, దాడికి కారణమైన దుండగులను అతి త్వరలో పట్టుకుంటామని సీఐ నరేష్ కుమార్ తెలిపారు.

# బడా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేలా కేంద్ర బడ్జెట్



**నర్సంపేట, ఫిబ్రవరి 19(నినాదం) :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ బుధవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రజలను వంచన చేసి బడా కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా ఉందని సిపిఎం జిల్లా నాయకులు కొరబోయిన కుమారస్వామి అన్నారు.ప్రజలకు ఆసరాగా లేని బడ్జెట్ ప్రవేశపెట్టారని దాని నిరసిస్తూ నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డు కూడలి వద్ద సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కుమారస్వామి మాట్లాడుతూ2025-26 బడ్జెట్ తన రాజకీయ అవసరాలే ఉపయోగించుకున్నది తప్ప, దేశ సమ్మిళిత వృద్ధిని ఏమాత్రం పట్టించుకున్నట్లు లేదన్నారు.కేంద్ర ప్రభుత్వం పదే పదే వల్లెవేస్తున్న వికసిత్ భారత్ ఇలాంటి వైఖరితో సాధ్యమవుతుందా అని పునర్ సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు .ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో వరాలు ప్రకటించి, ఎన్నికలు లేని రాష్ట్రాల పట్ల వివక్ష చూపడం సరికాదు. దేశమంటే మట్టి కాదోయో దేశమంటే మనుషులోయ్ అంటూ ప్రసంగించిన నిర్మల సీతారామన్ గారూ, దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టడం బాధాకరమన్నారు.పది సంవత్సరాలనుండి ఇదే దోరణిని ప్రదర్శిస్తూ రాజకీయ అవసరాలు తీర్చుకుంటున్నది కేంద్ర ప్రభుత్వం-2024 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్, 2025 ఢిల్లీ, బిహార్ రాష్ట్రాల కోసం బడ్జెట్ పెట్టారు 2026 యూపీ బడ్జెట్, 2027 గుజరాత్ కోసం బడ్జెట్ పెడుతారా యావత్ దేశానికి సరిపోయే బడ్జెట్ ఎప్పుడు పెడతారని ప్రశ్నించారు. బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి చోటు లేదా తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు విలువ లేదా అని విమర్శించారు .ఇది కేంద్ర బడ్జెట్ లా లేదు, కేవలం మూడు, నాలుగు రాష్ట్రాల బడ్జెట్ లాగా ఉందని అన్నారు తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉండి తెలంగాణ రాష్ట్రానికి ఏం సాధించినట్లు అని విమర్శించారు తెలంగాణతో తమకు బంధం లేదని బడ్జెట్ ద్వారా మరోసారి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరూపించింది. కేంద్ర జీడీపీకి 5.1శాతం కాంట్రిబ్యూట్ చేస్తున్న తెలంగాణ మరోసారి మోస పోయిందని ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ట్రైబల్ యూనివర్సిటీకి ఇవ్వాల్సిన నిధులు కూడా ఇవ్వకపోవడం బాధాకరం తెలంగాణకు నిధులు కేటాయించక పోవడం దారుణమని అన్నారు . రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీ చేసిందేం లేదు అని కేంద్రం బడ్జెట్ ద్వారా నిధులు రాబట్టుకోవడంలో బిజెపి ఎంపీలు విఫలమయ్యారని .బిజేపీ పార్టీ తీరు వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని నిధుల కేటాయింపు సంగతి దేవుడెరుగు, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను కూడా కేంద్రం నెరవేర్చలేకపోయిందని .కేంద్రానికి మద్దతు పలికిన జనతాదళ్ (యూ) బీహార్‌లో వివిధ అభివృద్ధి పనులకు గతేడాది రూ. 26,000 కోట్ల సాయం, 2,400 మెగావాట్ల పవర్ ప్లాంట్, గయాలో పారిశ్రామిక కారిడార్, నూతన విమానాశ్రయాలు, మెడికల్ కాలేజీలకు సాయం తదితరాలు పొందింది.ఎన్నికలు దగ్గర ఉన్నాయని ఇప్పటి బడ్జెట్ లో బిహార్ కు మరిన్ని వరాల జల్లు కురిపించారు.బిహార్ లో మఖాన బోర్డు ఏర్పాటు,మిథిలాంచల్ లో వెస్టర్న్ కోసి కెనాల్,ఐఐటీ పాట్నా విస్తరణ,బిహార్ లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు,ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.8 సీట్లు ఇచ్చి బీజేపిని గెలిపిస్తే తెలంగాణ ప్రజలకు మొండి చెయ్యి ఇచ్చారని 8 మంది బిజేపీ ఎంపీలు, రాష్ట్రానికి ప్రత్యేకంగా 8 రూపాయలు కూడా అధికంగా సాధించిన దాఖలాలు లేవు అని అన్నారు తెలంగాణలో ప్రాజెక్టుల సంగతి ఏమిటి? పునర్విభజన చట్టం హామీల పరిస్థితి ఏమిటి దేశ ప్రయోజనాలు కాపాడటంలో బీజేపీ వైఫల్యం చెందిన విషయాన్ని దేశ ప్రజలు గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్,పట్టణ నాయకులు గడ్డమీద బాల కృష్ణ, కంది కొండ రాజు, బుర్రి ఆంజనేయులు, ఎండీ ఫరిదా, వజ్జంతి విజయ ,కార్తీక్ అనిల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేటలో ఘనంగా చత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు



**నర్సంపేట, ఫిబ్రవరి 19(నినాదం ):** నర్సంపేట పట్టణ కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ – బజరంగ్దళ్ , అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, చత్రపతి శివాజీ యువదల్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ రక్షకుడు, హిందూ సామ్రాట్ చత్రపతి శివాజీ మహారాజ్ 395 జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ నిలువెత్తు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ఘనంగా పుష్పాలతో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విశ్వహిందూ పరిషత్ జిల్లా సహా కార్యదర్శి మల్యాల రవి, నర్సంపేట ఉపాధ్యక్షులు రిటైర్డ్ ఉపాధ్యాయులు రవీందర్ శర్మగారు మాట్లాడుతూ ఎందరో యువకులకు ఆదర్శంగా నిలిచిన నిజమైన మహనీయుడు చత్రపతి శివాజీ మహారాజ్ తన తల్లి, తన గురువు నడిపిన బాటలో భరతమాత కోసం హైందవ ధర్మ రక్షణ కోసం చివరి కంట పోరాడిన హిందూ ధర్మస్థాపకుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని చెప్పారు ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలు పుట్టిన రోజుల సందర్భంగా కేకులు కాదు బాకులతో యుద్ధనీతి నేర్పే విధంగా హిందూ ధర్మరక్షణకు కంకణబద్దులు అవ్వాలన్నారు.ప్రతి తల్లి తండ్రి పిల్లలకు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత చరిత్రని తెలియచేసి ప్రతి ఒక్కరిని శివాజీ మహారాజ్ లా తీర్చిదిద్దలని పిలుపునిచ్చారు. ఇలా ప్రతి ఇంటిలో ఒక శివాజీ మహారాజ్ ఒక శంబాజీ మహారాజులు తయారయ్యే విధంగా సినిమాలు కానీ నాటక రంగాలలో, పాఠ్యపుస్తకాలలో వీరి చరిత్రలను తెలిపే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.దీనిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించే విధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బౌద్దిక్ ప్రముఖ్ భాషబోయిన వెంకటేష్ నర్సంపేట విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు చోల్లేటి జగదీశ్వర్ కార్యదర్శి వేల్పుల శ్రీధర్,ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ భజరంగ్ దళ్ చరణ్ ప్రేమ్ శివ గణేష్, ఏబీవీపీ కార్యకర్తలు ప్రణయ్, ప్రదీప్,రాకేష్, ఛత్రపతి శివాజీ యువ దళ్ కార్యకర్తలు దుర్గ, సాయి, ప్రవీణ్,జీవన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# 21న సిఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం

**భూపాలపల్లి, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని సీఈఆర్ క్లబ్ నందు ఈనెల 21న సింగరేణి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఏరియా సింగరేణి అధికార ప్రతినిధి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆయుర్వేద వైద్య శిబిరాన్ని మాత ఆయుర్వేదిక్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా, విశ్వనాథ మహర్షి పాల్గొని మందులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పరిసర కాలనీలా ప్రజలు చదివినియోగం చేసుకోవాలని అధికార ప్రతినిధి మారుతి కోరారు.

# పలుగుల అడవిలో యువకులను వెంబడించిన పెద్దపులి

**- ద్విచక్ర వాహనం వెంటపడ్డ పెద్దపులి**

**మహాదేవపూర్ ఫిబ్రవరి 19, ( నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, మహాదేవపూర్ రేంజ్ పరిధిలోని అడవుల్లో పెద్దపులి సంచారం ఆయా గ్రామాల ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. తూర్పుగోదావరిలో గత వారం రోజులుగా సంచరిస్తున్న పెద్దపులి కోసం అటవీశాఖ అధికారులు గాలిస్తున్నారు. అడవుల్లో పెద్దపులి జాడ కోసం ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేస్తూ అడవులను జల్లెడ పడుతున్నారు. అయినా పెద్దపులి దొరకకుండా అడవుల్లో తిరుగుతుంది. తాజాగా కాళేశ్వరం పలుగుల మధ్యలో అటవీ ప్రాంతంలో బుధవారం 7:30 గంటల సమయంలో మహాదేవపూర్ కు చెందిన తుంగల గోవర్ధన్, బియ్యం మహేందర్ లు పలుగుల నుండి ద్విచక్ర వాహనంపై మహాదేవపూర్ వస్తున్న క్రమంలో పెద్దపులి ద్విచక్ర వాహనం వెంటపడింద ని ప్రాణభయంతో ఆ గుంతల రోడ్డుపై స్పీడ్ గా వచ్చామని ప్రాణాలు అరి చేతిలో పెట్టుకొని మహాదేవ పూర్ వరకు చేరుకున్నామని వారు తెలిపారు. వారం పది రోజులు గా పెద్దపులి జాడ కోసం అటవీశాఖ అధికారులు అడవుల్లో వెతుకుతున్న పాదముద్రలను గుర్తించారే తప్ప పులి జాడను మాత్రం తెలుసుకోలేకపోయారు. వీరిపై దాడికి ప్రయత్నించిన పెద్దపులి పలుగుల అడవుల్లోనే ఉందని తేలిపోయింది.

# మిర్చి ధరపై ‘కన్నెర్ర’

- క్వింటాల్ రూ.25వేలకు కొనాలని డిమాండ్
- ఖమ్మం మార్కెట్‌లో సిపిఎం, ఏఐకేఎస్, తెలంగాణ రైతుసంఘం మహాధర్నా
- ఆహారపంటగా గుర్తించి మద్దతు ధరల జాబితాలో చేర్చాలి
- ధరల స్థిరీకరణ కోసం ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి
- పంటలు, ఎరువులు, పురుగుమందులపై జీఎస్టీ రద్దుకు డిమాండ్
- ప్రధాని మోడీకి వ్యవసాయ రంగం గురించి పట్టదు..
- రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర, జిల్లాలో ముగ్గురు మంత్రులుండి ఏమి ఉపయోగం
- తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని, రాష్ట్ర నాయకులు నున్నా







**ఖమ్మం, ఫిబ్రవరి 18( నినాదం న్యూస్) :** ఖమ్మం మిర్చి ధరలపై సీపీఐ(ఎం) కన్నెర్ర చేసింది. క్వింటాల్ మిర్చికి రూ.25వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ఏఐకేఎస్, తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మహాధర్నా నిర్వహించింది. ఎర్రజెండాలు చేతపట్టి పెద్ద ఎత్తున రైతులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీనిలో భాగంగా తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ క్వింటాల్ మిర్చికి రూ.25వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిర్చిని వ్యాపార పంటగా కాకుండా ఆహారపంటగా గుర్తించాలని, ఖమ్మంలో మిర్చిలి లిబోర్డు ఏర్పాటు చేసి ధరల స్థిరీకరణకు చర్యలు చేపట్టాలని కోరారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ల ద్వారా రూ.25వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 2023లో ఇదే మార్కెట్లో క్వింటా మిర్చి రూ.25,500 పలుకగా ఇప్పుడు కేవలం రూ.11 వేల నుంచి 13వేలకే కొనుగోలు చేస్తుండటంపై మండిపడ్డారు. రాష్ట్రంలో సుమారు ఐదు లక్షల ఎకరాల్లో మిర్చి సాగైందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో సాగు చేశారని, రాష్ట్రంలో ఈ ఏడాది 447 మంది రైతులు చనిపోయారని, జిల్లాలో మిర్చి కారణంగా నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇంతమంది రైతులు చనిపోతున్నా మిర్చి ధరలపై రాష్ట్రప్రభుత్వం కేంద్రంతో ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. ప్రధాని మోడీకి వ్యవసాయ రంగం గురించి పట్టదని, రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, ఖమ్మం జిల్లాలోలి ముగ్గురు రాష్ట్రమంత్రులు ఉండి ఏమి ఉపయోగం అని ప్రశ్నించారు.

**ధరల స్థిరీకరణకు మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి...**

వ్యాపార పంటగా చూస్తున్న మిర్చిని ఆహార పంటల జాబితాలో చేర్చాలని పోతినేని డిమాండ్ చేశారు. కారం లేకుండా కూర తినే పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. అటు గుంటూరు ఇటు వరంగల్ మిర్చి మార్కెట్లకు మధ్యలో ఉన్న అతి పెద్ద మార్కెట్ ఖమ్మంలో ధరల స్థిరీకరణ కోసం మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో వామపక్షాల భాగస్వామ్యంతో పనిచేసిన యూపీఏ ప్రభుత్వం మిర్చికి 10శాతం కంటే ధర తగ్గినప్పుడు గిట్టుబాటు ధర కోసం చర్యలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అమెరికా పర్యటనలో రూ.500 కోట్ల డాలర్ల ఆయుధ హెలికాప్టర్ల కొనుగోళ్లపై ఆ దేశాధ్యక్షుడు ట్రంప్‌తో ఒప్పందం చేసుకున్న మోడీ...అమెరికా, చైనా, థాయ్‌లాండ్ తదితర దేశాలకు ఎక్కువగా ఎగుమతి అయ్యే తేజా, ఆర్మూర్ రకం మిర్చి గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. పంటలు, ఎరువులు, పురుగుమందులపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతులు పురుగుమందులపై రూ.50వేల పెట్టుబడి పెడితే 18% జీఎస్టీ పేరుతో రూ.9వేలు పన్ను కట్టాల్సి వస్తోందని వివరించారు. పంట అమ్మకాలపైనా జీఎస్టీ వసూలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. పంటలు, ఎరువులు, క్రిమిసంహారక మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎరువులపై 10–30% పన్నులు, డీజిల్, పెట్రోల్‌పై కమీషన్లు దండుకుంటున్న కేంద్రప్రభుత్వం మిర్చి పంట ధరను 60% తగ్గించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరమ దుర్మార్గంగా వ్యవహారించే ప్రభుత్వాలున్న తరుణంలో ఉద్యమించకపోతే రైతు సమస్యలు పరిష్కారం కావన్నారు. రైతులు పోరాటాలను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

**- స్పందించకపోతే మంత్రుల క్యాంప్ కార్యాలయాల ముట్టడి : నున్నా నాగేశ్వరరావు**

ఈ సీజన్‌లో ఇప్పటికీ రెండుసార్లు మిర్చి ధరల పెంపుపై ఆందోళనలు చేశాం...మిర్చి రైతులు మరణిస్తున్నారు.. ఇప్పటికీ జిల్లాలో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు.. ఇకన్కైనా స్పందించకపోతే మిర్చి రైతులతో మంత్రుల ఇళ్లు, క్యాంప్ కార్యాలయాలు ముట్టడిస్తామని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర నాయకులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. వివిధ రకాల తెగుళ్లకు రైతు ఒక్కసారి పురుగుమందు కొడితే ఎకరానికి రూ.2వేలకు పైగా ఖర్చు వస్తుందని, అలాంటిది సీజన్‌కు 20 సార్లకు పైగా పిచికారీ చేయాల్సి వస్తోందన్నారు. పురుగుమందులపై రూ.లక్ష పెట్టుబడికి జీఎస్టీ కేంద్రానికి రూ.18వేలు చెల్లిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేకులుగా ఉన్నాయన్నారు. ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుకు ఎంపీ రఘురాంరెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. మిర్చి ధర రూ.15వేలకు తగ్గకుండా చూస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మిర్చి బోర్డు ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బంతు రాంబాబు కోరారు. సుగుంధద్రవ్యాల బోర్డు నుంచి విడదీసి మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్, జిటల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, నాయకులు భూక్యా వీరభద్రం, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావ్, రైతుసంఘం సీనియర్ నాయకులు తాతా భాస్కర్‌రావు, కొక్కెర పుల్లయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, ఆయిల్‌పామ్ రైతుసంఘం నాయకులు మహేశ్వరరెడ్డి, రైతుసంఘం నాయకులు ఎస్.నవీన్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణ, ఊరడి సుదర్శన్‌రెడ్డి, కొమ్ము శ్రీను తదితరులు పాల్గన్నారు.




- జిన్నారం కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ రాజు గౌడ్
- నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్స్ గాలి, నీరు, నేల కలుషితం
- ఆందోళన చెందుతున్న మాదారం, మంత్రికుంట, దుబ్బగుంట గ్రామల జనం

# క్రషర్లతో బతకలేం

**జిన్నారం /పటాన్ చెరు ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** కొండల్ని పిండి చేసేస్తున్నారు. నేల, నీరు కూడా కలుషితమవుతున్నా వారికి లెక్కేలేదు. నిబంధనలకు తూట్లు పొడువడం వారికి వెన్నతో పెట్టిన విద్య అని రాజు గౌడ్ మండిపడ్డారు. ఇదీ సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలాల్లోని మాదారం స్టోన్ క్రషర్లు పరిస్థితి. క్రషర్లు, ఆ క్రషర్లలో పేల్చే బ్లాస్టింగ్స్‌లతో గాలి, పొలాలు, నీటి వనరులూ కాలుష్యం బారినపడుతున్నాయి. స్టోన్ క్రషర్లు నిర్వహణ ఏర్పాటు నిబంధనల అమలును మైనింగ్, కాలుష్య నియంత్రణ మండలి వంటి విభాగాలు పర్యవేక్షించాలి. కానీ నిబంధనల అమల్లో చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిన్నారం మండలంలోని మాదారం, మంత్రి కుంట శివారులోని సర్వే నంబర్ 210 లో స్టోన్ క్రషర్లే ఇందుకు సాక్ష్యం. కాజు పల్లి, గ్రామలలో ఉన్న క్రషర్లు కూడా ఇదే తరహాలో సాగుతున్నాయి.ఈ స్టోన్ క్రషర్ల వల్ల సమీప ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాజు గౌడ్ మాట్లాడుతూగతంలో ఒకే ఒక క్రషర్ ఉండేది ఇప్పుడు కాస్త నాలుగయ్యాయి, మా ప్రాంతమంతా దుమ్ము, ధూళితో , నిబంధనలకు విరుద్ధంగా సమయం పాటించ కుండా బోర్ బ్లాస్టింగ్లు నిర్వహిస్తున్నారని ఆయన మండిపడ్డారు . సర్వే నంబర్ 210 సుమారు 400 ఎకరాల పైచిలుకు భూమి ఉన్నది గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఈ భూమిలో మూడు కొత్త కషర్లకు పర్మిషన్ అక్రమంగా లంచాలు కట్టి విచ్చలవిడిగా క్రషర్లు అక్రమంగా నడిపిస్తున్నారన్నారు. నిబంధనలు పాటించకుండా పూర్తిగా తోంగాలో తొక్కుతూ, దీనికి తోడుగా అధికారులు వేవరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రవర్తనను ముగింపు 210 సర్వే నంబర్లు క్రషర్ లకు కేటాయించిన భూమిని కలెక్టర్, జిల్లా మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ, ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకువెళ్లి ఈ ప్రాంతానికి కెమికల్ లేని పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆయన వారిని కోరుతామన్నారు. రహదారులు, ఇళ్ల నిర్మాణానికి కంకర, డస్ట్ చాలా ముఖ్యమే కానీ వాటి తయారీలో జరుగుతున్న లోపాలే ఇబ్బందికరంగా మారుతున్నాయనిన్నారు. జనావాసాలు, నీటివనరుల దగ్గర కంకర మిల్లుల వల్ల సమస్య వస్తున్నాయి ఈ మండలాల్లోని క్రషర్లతో పర్యావరణానికి, మాదారం చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆరోగ్యానికి నష్టం జరుగుతోందని పలువురు ఆందోళన చెందుతున్నా క్రిషర్ల యజమానులు విచ్చలవిడిగా బ్లాస్టింగ్స్ జరుగుతుంటే, నిబంధనలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్లు నిర్వహించబడుతుంటే, నిబంధనలు తుంగలో తొక్కి నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటే అధికారులు తనిఖీలు చేయకుండా ఆఫీసుల్లో నిద్రపోతున్నారా..? అనే సందేహాలు, ప్రశ్నలు సహజంగానే తలెత్తుతున్నాయనిన్నారు.



క్వారీల పేలుళ్ల వల్ల ఇళ్లు బీటలు వారుతున్నాయని కొందరు, దుమ్ముతో తమ జీవనం దుర్భరంగా మారుతోందని మాదారం, మంత్రి కుంట, దుబ్వాగుంట గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అయినా ఇంతటితో కంట్రోల్ చేయకుండా విచ్చలవిడిగా బ్లాస్టింగ్ చేస్తూ రాతిపొడి పొలాల్ని ముంచెత్తడం, అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తే సరైన దిగుబడి రావట్లేదని మ గ్రామాల రైతులను ఆత్మహత్యలు చేసుకునేంత పరిస్థితిలో ఈ క్రషర్ల యాజమాన్యలు తెస్తున్నారన్నారు. మాదారం గట్టు శివారులోని స్టోన్ క్రషర్ మంగళవారం మధ్యాహ్నం ఒకరు ఈవినింగ్, మరొకరు ఆ స్టోన్ క్రషర్ చేసిన బ్లాస్టింగ్ వల్ల మాదారం గ్రామస్తులు ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. మాదారం, మంత్రి కుంట, దుబ్వాగుట గ్రామస్థులు ఒక్కసారిగా దుమ్ము ఆ గ్రామాన్ని కమ్మేసిందని, చిన్న పిల్లలు ఊపిరాడని స్థితికి చేరుకున్నారని తెలిపారు. ఇది నిత్యకృత్యంగా మారిందనిన్నారు. ఈ బ్లాస్టింగ్‌లతో వచ్చే దుమ్ము, ధూళితో నిత్యం నరకం అనుభవిస్తున్నామని, దుమ్ము పడడం వల్ల తిండి కూడా తినలేకపోతున్నామని, పంటల దిగుబడి తగ్గుతోందని, అనారోగ్యాల పాలవుతున్నామని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమగ్రమైన విచారణ చేపట్టి నిబంధనలు తుంగలో తొక్కుతున్న స్టోన్ క్రషర్లపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందనిన్నారు.

## నవోదయ విద్యాలయం కోసం స్థల పరిశీలన చేసిన కలెక్టర్



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామ పరిధిలో హనుమకొండ జిల్లాకు సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం పరిశీలించారు. జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం 30 ఎకరాలు కావాల్సి ఉండగా,గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి పంపించగా కలెక్టర్ ఆ భూములను పరిశీలించారు.

## మట్టి లారీని పట్టుకున్న ముల్కనూరు పోలీసులు



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీ నీ పట్టుకున్న పోలీసులు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని ముల్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల గట్ల నర్సింగాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని స్థానికుల సమాచారం మేరకు మట్టి లారి ని పట్టుకొని ముల్కనూర్ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ మట్టి తరలిస్తున్న లారీపై కేసు నమోదు చేశామని ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు. అనుమతులు లేకుండా, ఇసుక, మట్టి తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ముల్కనూర్ ఎస్సై సాయిబాబా హెచ్చరించారు.

## కో ఆర్డినేటర్ మనవరాలి ఫంక్షన్ కి హాజరైన కిసాన్ పరివార్ టీం



**డోర్నకల్ /మరిపెడ ఫిబ్రవరి 19(నినాదం న్యూస్):** మరిపెడ మండల కోఆర్డినేటర్ కారంపూడి వెంకటేశ్వర్లు మనవరాలు సారీ ఫంక్షన్ కి కిసాన్ పరివార్ అధినేత భూపాల్ నాయక్,సిఈఓ డాక్టర్ వివేక్ ఆర్థిక సహాయం మర్చిపోలేనిది మరిపెడ ఇంచార్జి కారంపూడి వెంకటే శ్వర్లు అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరిపెడ ఇంచార్జ్ ఎడెల్లి వెంకన్న, సీరోలు ఇన్చార్జ్ విష్ణు,డోర్నకల్ ఇంచార్జ్ రామ్మూర్తి,నరసింహులా పేట ఇన్చార్జ్ గణేష్,గుండెపుడి కోఆర్డినేటర్ ప్రవీణ్, వెంకటరత్నం పాల్గొన్నారు..

## వివాహా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్

**చింతపల్లి,ఫిబ్రవరి19(నినాదం న్యూస్)** మండలంలోని గొడకొండ్ల గ్రామ మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అంగిరేకుల గోవర్ధన్, విజయ ల కుమారుడు ప్రవీణ్ కుమార్ ,సురుచి ల వివాహ వేడుకల్లో భాగంగా గొడకొండ్ల ఎస్ వి ఆర్. ఫంక్షన్ హాల్ లో జరిగిన రిసెప్షన్ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత%శీ% అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సిరాజ్ ఖాన్, మాజీ ఎంపిపి.కొండూరు భవాని పవన్ కుమార్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, నాయకులు రుక్మా రెడ్డి,రాజేష్, పి ఎ సి ఎస్. చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, ఎరుకల వెంక టయ్య గౌడ్, ముచ్చర్ల యాదగిరి, ముక్కామల వెంకటయ్య గౌడ్, మాస భాస్కర్, యాచారం యాదయ్య గౌడ్, గుండ్లపల్లి నరసింహా రెడ్డి, హరి లాల్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.



## నైపుణ్యాభివృద్ధితో ఉపాధిలో
# మెరుగ్గా రాణించాలి.

**-అందించిన తోడ్పాటు అవకాశాలను ఉపయోగించుకొని పదిమందికి ఉపాధి ఇవ్వాలి.**

**-అద్భుతమైన రుచితో టీ బాగుంది చెల్లెమ్మ అంటూ కితాబుచ్చిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, ఫిబ్రవరి 19( నినాదం న్యూస్):** ప్రజలలో నమ్మకం కలిగిస్తూ నాణ్యతను పెంచుతూ వ్యాపారాలను విస్తరించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకాంక్షించారు.ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ లోని తరుణ్ హోట్ సమీపంలోని ఇందిరా మహిళా శక్తి స్త్రీ టీ స్టాల్ ను బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. స్త్రీ టీ స్టాల్ని ని ర్వహకురాలుతో కలెక్టర్ ముచ్చటించారు. మంచి సెంటర్ లో టీ స్టాల్ పెట్టారు ఏలా నడుస్తుంది, ఇంకా ఏమైనా వ్యాపారం విస్తరించాలని ఉందా.. మేము అండగా ఉంటాం.. ధైర్యంగా ముందు అడుగు వేయాలని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఇక్కడ ఏన్ని రకాల టీ లు అమ్ముతున్నారు. ప్రస్తుత ఉన్న కాలాన్ని అనుగుణంగా ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని నాణ్యతను ఉంచుతూ, నమ్మకాన్ని పెంచుకోవాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధితో స్వంత బలం మీద ఉపాధి పొందడమే కాక పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. టీ స్టాల్ నిర్వహకురాలి కోరిక మేరకు కలెక్టర్ టీ సేవించారు. టీ అద్భుతమైన రుచితో బాగుంది చెల్లెమ్మ అంటూ కలెక్టర్ కితాబు ఇచ్చారు. మహిళలు ఆర్థికంగా బలపడాలనే సంకల్పంతో ఇందిరా మహిళా శక్తిలో భాగంగా స్త్రీ టీ స్టాల్స్, మిల్క్ పార్లర్, పాడి పశువుల యూనిట్ లు, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ, మైక్రో ఎంటర్ ప్రైజెస్, క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిరంతరం పర్యవేక్షణ చేస్తూ స్త్రీ టీ క్యాంటీన్ మంజూరు చేసి నిర్వాకులకు వ్యాపారంలో తోడుగా అధికారులు ఉంటున్నారని అన్నారు. యూనిట్ కేటాయించాక ఏ మేరకు లాభాలు ఉంటాయనే అంశంతో పాటు వాటి నిర్వహణ, లాభాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశ్యంతో స్త్రీ టీ క్యాంటీన్లు ఖమ్మం బ్యాండ్ ఉండే విధంగా ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం తరపున యూనిట్ గ్రౌండ్ చేసి, స్థల గుర్తింపు, ఏమేం అమ్మాలి, నాణ్యతపై క్షుణ్ణంగా చర్చించి , శిక్షణ ఇప్పించాకే వారికి అర్థిక సహాయం అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా
# యడ్లపల్లి వెంకట నరసయ్య..

**పార్టీకి చేసిన సేవలకు దక్కిన పదవి...**
**నరసయ్యను అభినందించిన గొండ్రియల గ్రామస్తులు...**



**కోదాడ/అనంతగిరి, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గొండ్రియల గ్రామానికి చెందిన యడ్లపల్లి వెంకట్ నర్సయ్య ఎన్నికయ్యారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు వెంకట నరసయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బిజెపి రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా వెంకట నరసయ్య మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషిచేయనున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి అన్ని వర్గాల ప్రజలు, పార్టీ శ్రేణులు కలిసి వచ్చే విధంగా చూస్తానని తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన... జిల్లా అధ్యక్షులు శ్రీలత రెడ్డి, నాయకులు బొబ్బ భాగ్యరెడ్డి ,కనగాల వెంకట్రామయ్య, నూనె సులోచన, అక్కిరాజు యశ్వంత్ ,కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, అంజి యాదవ్, చింతకుంట్ల సతీష్, ఏలేటి వెంకటేశ్వర్ రెడ్డి, సిద్దయ్య, లింగయ్య , యడ్లపల్లి రామారావు, జల్లా నరసింహారావు కి అభినందన తెలిపారు.

# గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

**-జెడ్పి చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పామేన జ్యోతి బీమ్ భరత్.**



**చేవెళ్ల ఫిబ్రవరి 19(నినాదం న్యూస్):** గ్రామ దేవతల చల్లని ఆశీస్సులు ప్రజల పైన ఎల్లప్పుడూ ఉండాలని జడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పామేన జ్యోతి భీమ్ భరత్ పేర్కొన్నారు.చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండలం అమ్డాపూర్ గ్రామంలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీశ్రీశ్రీ రక్త మైసమ్మ శ్రీ ఎల్లమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జడ్పీ చైర్ పర్సన్ శ్రీమతి సునీత మహేందర్ రెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పమన జ్యోతి భీమ్ భరత్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలపై ఎప్పుడూ ఉండాలని గ్రామ దేవతలు గ్రామ స్థాయిలో భద్రత, ఆరోగ్యం, శాంతి, సంపదలను కాపాడే దేవతల ఆశీర్వాదంతో గ్రామాలు క్షేమంగా ఉంటాయని అన్నారు. గ్రామాలు భక్తి, సాంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తాయని గ్రామ దేవతల కృపతో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, గ్రామంలో శాంతి సమృద్ధులు వర్ధిల్లాలని కోరారు. గ్రామ ఆడబిడ్డలు, వివిధ గ్రామాల నుండి వచ్చిన ఆడబిడ్డలు బోనామెత్తి అమ్మవారి దీవెనల కోసం ప్రతి ఆడబిడ్డ హిందూ సంస్కృతికి నిజమైన వారసురాలు అని అన్నారు. అమ్మవారి చల్లని చూపు ప్రజల అందరిపై తప్పక ఉంటుందని పేర్కొన్నారు. ఎల్లమ్మ మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనడం పట్ల చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నానని అన్నారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక అయిన వన దేవతల పండుగల విశిష్టతను భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్లు మాజీ ఎంపీటీసీ లు , ప్రజా ప్రతినిధులు మాజీ చైర్మన్లు మహిళా నాయకురాళ్ళు మరియు అన్ని అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అన్య మతాల పట్ల లౌకికతత్వాన్ని చాటిన మహారాజు శివాజీ

## బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన చత్రపతి శివాజీ 395వ జయంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను నమ్మిన ధర్మాన్ని ప్రేమిస్తూనే ఇతర మతాల పట్ల లౌకిక తత్వాన్ని చాటుతూ మొగలులపై వీర పరాక్రమాన్ని చాటిన గొప్ప పరాక్రమవంతుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని కొనియాడారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయదర్శిని ఎంక్లేవ్ నందు నిర్వహించిన చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొండల్ రావు, ఉపాధ్యక్షులు ఏ. ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి మహేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి చిన్నారెడ్డి, కోశాధికారి కృష్ణ కిషోర్, ఇతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ గడ్డ వద్ద...

పోచమ్మ గడ్డ వద్ద నిర్వహించిన చత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శివాజీ సేన సభ్యులు విష్ణు, శివ, గోపి మైలర్, సాంబ, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సువర్ణ కృష్ణసాగర్, జంధా మంజుల కుమార్, నాయకులు లక్ష్మణ్ గౌడ్, సన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

# శివాజీ స్ఫూర్తితో ధర్మ పరిరక్షణకు పాటుపడుదాం

## -డా.పాల్వాయి హరీష్ బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే





**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** శివాజీ మహారాజ్ స్ఫూర్తితో ధర్మ పరిరక్షణకు పాటుపడదామని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని శివాజీ చౌక్ లో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని హిందూ జాగరణ్ మంచ్, భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్, హిందూ వాహిని, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు.ఈ సందర్భంగా సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్‌స్ఫూర్తితో మనమందరంధర్మరక్షణకు పాటు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. హైందవ ధర్మ పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం మనం దరికీ చిరస్మరణీయమన్నారు. తురుష్కుల దండయాత్రల నుండి భారత భూభాగాన్ని కాపాడిన మహానీయున్ని మనమందరం గుర్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాజపా జిల్లా నాయకులు, కాగజ్నగర్ పట్టణ నాయకులు, శివాజీ అభిమానులు పాల్గొన్నారు.

### పీవీ విజ్ఞాన కేంద్రం పెండింగ్ పనులను

# త్వరగ పూర్తి చేయండి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విజ్ఞాన కేంద్రం పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పీవీ నరసింహారావు విజ్ఞాన కేంద్రం పనులను కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలను సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పీవీ విజ్ఞాన కేంద్రంలోనిర్మాణంలో ఉన్న ఆడిటోరియం, మ్యూజియం, గ్రీనరీ, పెయింటింగ్, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, ఆర్ట్ గ్యాలరీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అధికారులతో మాట్లాడుతూ పీవీ విజ్ఞాన కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. విజ్ఞాన కేంద్రం ఆవరణలో అధికారులు స్థానికులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మొక్కను నాటారు. ఈ సందర్భంగా డిఆర్డీవో శ్రీను, అడిషనల్ డిఆర్డివో శ్రీనివాసరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, డిఈ ధనరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పేద,మధ్యతరగతి ప్రజలను లూటీ చేయడమే 2025-26 బడ్జెట్

### కీలుకానీ.లక్ష్మణ్, ఉమా మహేష్




**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్) :** కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ను నిరసిస్తూ సిపిఐ. సిపిఎం, మాస్లైన్ పార్టీల ఆధ్వర్యంలో షాపూర్ రైతుబజార్ వద్ద నిరసన కార్యక్రమము నిర్వహించారు. కార్యక్రమములో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూభారీ పెట్టుబడులు,మౌలిక సదుపాయాల విస్తరణ లక్ష్యాలుగా ఉన్న బడ్జెట్‌తో సామాజిక సేవలు,పేదలు, నిరుద్యోగ యువత,రైతాంగం, వ్యవసాయ కూలీలకు ఒరిగేదేమీ లేదనీ విమర్శించారు. ప్రజలకు వినియోగ సామర్థ్యం, కంపెనీలకు పెట్టుబడి సామర్థ్యం పెరిగే ప్రణాళికలు రచించ బడతాయని ఆశించారు. 2016లో నోట్ల రద్దు తర్వాత ఈ రెండు అంశాలూ నానాటికీ బలహీన పడుతున్నయనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజలను ఓటు బ్యాంకుగా చేసుకొని ,ఓట్లు రాల్చుకోవడానికి బడ్జెట్‌ను ఉపయోగించుకునేల కనిపిస్తోందని విమర్శించారు. బీహార్ గురించిన బడ్జెట్ ప్రతిపాదనలే దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. దేశంలో ఉపాధికల్పనకు వెన్నెముక లాంటి చిన్న మధ్యతరహా పరిశ్రమలు సుమారు 23 కోట్లమందికి బతుకుదెరువు కల్పిస్తోంది. ఈ పరిశ్రమలు అనేక సంస్థాగత లోపాలు,పరిమితులు, బంధనాలతో మగ్గుతున్నాయి. దేశంలో కనీసం మూడోవంతు శ్రామికులకు ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమలు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నా జీఎస్టీ పేరుతోటి కేంద్రం చిన్న పరిశ్రమలను దివాలా తీయించి చిన్న పరిశ్రమల ఊసే లేకుండా చేసే ప్రయత్నం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో 200 మంది కోటేశ్వరులపై నాలుగు శాతం సంపద ప్రవేశపెట్టి కార్పొరేట్ పన్నులు పెంచాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీసం మద్దతు ధర హామీ కల్పించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 50 శాతం కేటాయింపులు పెంచాలని ఆరోగ్య, విద్యారంగాలకు జిడిపిలో మూడు శాతం చొప్పున కేటాయించాలని, స్కీం వర్కర్ల గౌరవ వేతనంలో కేంద్ర వాటాను పెంచాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఈ దేవదానం, పీ అంజయ్య, డి కరుణాకర్, కే శీను ఆర్ స్వాతి, సిపిఐ మండల నాయకులు కే స్వామి, నరసింహ రెడ్డి, జార్జ్, సుంకిరెడ్డి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు వి,ప్రవీణ్, జి వెంకన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### రైతు ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు

# కేటీఆర్‌కు గానీ బీఆర్ఎస్ నాయకులకు లేదు

**భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్**



**మహేశ్వరం, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో చేపడుతున్న రైతుల సంక్షేమ పథకాలపై అదే విధంగా ఇతర సంక్షేమ పథకాలపై సీఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపై బురద జల్లే మాటలు కేటీఆర్ మాట్లాడడం... సిగ్గుచేటని భారత గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్ అన్నారు. బుధవారంకల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ పట్టణ కేంద్రంలో రైతుల పేర్లతో పెట్టిన రైతు దర్నా దీక్ష అని దొంగ దీక్షలో కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాల పై కేటీఆర్ మాట్లాడటం తప్పుపట్టారు. ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఏమాత్రం న్యాయం చేశారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గత హయాంలో మోసపూరితమైన హామీలతో ప్రజలను నమ్మించి పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఏనాడూ ప్రజలను కలవడానికి ఇష్టపడని మీరు ఇప్పుడు అధికారం పోగానే ప్రజలు గుర్తుకొస్తున్నారా అని అన్నారు. రైతుల పేర్లు చెప్పుకొని రైతు దీక్ష అని దొంగ దీక్షతో రైతుల సంక్షేమ పథకాల గురించి కేటీఆర్ మాట్లాడే మాటలను ప్రజలు చీకొడుతున్నారని, తెలంగాణ ఉద్యమాలు ఎక్కడ ఉన్నావు, యూనివర్సిటీ ఎప్పుడైనా అడుగు అడుగు పెట్టారా.. కేవలం హైదరాబాద్ ఫ్లేవర్ కమిషన్ కోసం మీ ఆదాయం,, అసలు తెలంగాణ గురించి ఏం తెలుసు మీకు, రైతుల రుణమాఫీ అని మోసపూరితమైన హామీతో రెండుసార్లు గద్దెనెక్కి కనీసం ఒక్కసారైనా లక్ష రూపాయల రుణమాఫీ కూడా చేయని ప్రభుత్వం మీ గత ప్రభుత్వమని అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 7 లక్షల కోట్లు అప్పుల రాష్ట్రంగా మార్చారని, ఈ యొక్క అప్పుకు దాదాపు 6000 వేల కోట్లకు పైగా మిత్తి కడుతున్నామని, అయినా సరే మా యొక్క కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే రైతులందరికీ భారతదేశ చరిత్రలోనే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత మా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిది అని అన్నారు. అదేవిధంగా రైతులందరికీ రైతు భరోసా కింద సంవత్సరానికి ఎకరానికి 12000 రూ ఇస్తున్నామని అన్నారు. ఇదివరకే చాలామంది రైతులకు 6000 రూ తమ ఖాతాలో పడ్డాయని అన్నారు. త్వరలోనే ప్రతి ఒక్క రైతు ఖాతాలో రైతు భరోసా వేస్తామని చెప్పారు. అసలైన రైతులకు ఇవ్వకుండా గుట్టలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, రోడ్లకు, మరియు వందల ఎకరాలు ఉన్న భూస్వాములకు వృధా నిధులను సమకూర్చారని విమర్శించారు. రైతులకు వ్యవసాయ పనిముట్ల సబ్సిడీలు 10 సంవత్సరాలు ఇవ్వకుండా ఎగ్గొట్టింది మీ అయ్యా కేసీఆర్ కాదా కేటీఆర్ అని దుయ్యపట్టారు. పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని, ఉద్యోగాలు కల్పించలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదని పైగా ఇందిరమ్మ ఇల్లు ఏవి అని అడగడానికి కూడా సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 70 వేల ఉద్యోగాలు పదిలక్షల ఆర్థిక సామాజిక సాంఘికంగా గత ప్రభుత్వం ఎమ్మెల్యే ఎంపీ పిఏ నుండి 500 నోటు ఇస్తేనే వాళ్ల ఫైలు చూసి కాండవ చూసి మాట్లాడిన విధానం కాదా.. మీకు తెలుసు మీ ఎమ్మెల్యే పీఏకు తెలుసు మేము చూసి చూసి మార్పు తెచ్చాం.. ఒక్కసారి మైసిగండ మైసమ్మకుపదవిలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులు చేపట్టావా.. మీ ఎమ్మెల్యే ఎంపీ కు మీ పరిపాలన ఏంటో మీ ఆత్మకు అడుగు.. మాట్లాడకుండా అదేవిధంగా రేషన్ కార్డులు, ఇద్దరమ్మ ఇండ్లు ఇస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సహకారంతో నియోజకవర్గ చరిత్రలోనే మా నాయకులు శాసనసభ్యులు శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి నియోజకవర్గానికి వందల కోట్లు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజల మద్దతుతో అన్ని స్థానాలను క్లీన్ స్వీప్ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ బాబూలాల్ శంకర్ తదితరులు ఉన్నారు.

# స్వీయ రక్షణ విధానాలు నేర్చుకోవాలి

### పీఎంశ్రీ పాఠశాలల్లో స్వీయ రక్షణ శిక్షణ కార్యక్రమాలు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య





**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 19(నినాదం న్యూస్ ):** విద్యార్థినులు స్వీయ రక్షణ విధానాలు నేర్చుకోవాలని, పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థినులకు స్వీయ రక్షణకు సంబంధించి కరాటే, మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చెప్పారు. భీమదేవరపల్లి మండలం వంగరలోని పీవీ రంగారావు బాలికల గురుకుల పాఠశాల లో హాస్టల్ నిద్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి బస చేయగా, బుధవారం విద్యార్థినుల దైనందిన కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థినులతో కలిసి అల్పాహారాన్ని



తీసుకున్నారు. అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాల వాతావరణం బాగుందని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చదువుల్లో, క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులను సమకూర్చుతున్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు, నోట్ బుక్స్ అందజేశారు. పాఠశాలలో 90 శాతం వరకు మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. పది రోజుల్లో మిగిలి ఉన్న పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో పాఠశాలకు మిషన్ భగీరథ నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పీఎం శ్రీ పథకం లో భాగంగా పాఠశాలకు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సునీత రాణి, ప్రిన్సిపల్ అఫ్రిన్ సుల్తానా, ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో వీరేశం, అధ్యాపక బృందం ఉన్నారు.

## టిడిపి సభ్యత్వ నమోదులో రమేష్ కు సన్మానం



**చింతపల్లి, ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలో అత్యధిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసిన సందర్భంగా హైదరాబాదులోని టిడిపి కార్యాలయంలో మండల టిడిపి అధ్యక్షుడు ఉప్పల రమేష్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరేడుగొమ్ము మండల పార్టీ మాజీ అధ్యక్షులు కోతి అమరేందర్ రెడ్డి , జమాల్ పూర్ వంశీ, టిఎన్ఎస్ఎఫ్ .నాయకులు జూలకంటి శ్రీనివాస్ రెడ్డి, రావిరాల శ్రీనివాస్, ఏదుల సాలయ్య ,బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడి లేని విద్య అవసరం: పగిడోజు వెంకటరమణ



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 18 (నినాదం న్యూస్)** ఒత్తిడి లేని విద్య ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు ఎంతో అవసరమని టి టి టి ఎస్ నీలగిరి 171 బ్యాచ్ మోటివేషనల్ స్పీకర్ పగిడోజు వెంకటరమణ అన్నారు. బుధవారం ఫణిగిరి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తిని తెలుసుకొని ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి ఉపాధ్యాయులు యాకూబ్ పాష ,రమేష్, ఎల్లయ్య, భాస్కర్ ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ 398వ జయంతి వేడుకలు



**చింతపల్లి, ఫిబ్రవరి 19(నినాదం న్యూస్):** మండల కేంద్రంలో బుధవారం బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ 398వ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించి చత్రపతి శివాజీ చిత్ర పటానికి పూలమా లలువేసి నివాళులర్పించారు . ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.నేటి తరానికి శివాజీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బజరంగ్దళ్ మండల ప్రెసిడెంట్ సోమరాజు ప్రదీప్, చెనమోని రాములు, శివర్ల రమేష్, సముద్రాల నగేష్, బొడ్డు మహేష్, అభినవ్, శివకుమార్,కుకడపు రామకృష్ణ,వెన్నం శేఖర్,చెట్లపల్లి ప్రసాద్, చెన్నయ్య,పున్నం భీమేష్,ఉప్పల యాదయ్య,కుంభం శ్రీనివాస్ రెడ్డి,బజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు, హైందవ సోదరులు పాల్గొన్నారు.

## విద్యుత్ లైన్ మెన్ ఇంట్లో చోరి

**- ఐదు తులాల బంగారం, 80 వేల నగదు అపహరణ**



**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్) :** నిజామాబాద్ నగరం లోని గాజుల్ పేట్ లో విద్యుత్ శాఖలో లైన్ మెన్ గా పనిచేసే అజిత్ సింగ్ ఇంటిలో చోరి జరిగింది. ఈ విషయం బుధ వారం ఉదయం వెలుగు చూసింది. గాజుల్ పేట్ కడ్డా ప్రాంతంలో నివాసం ఉండే అజిత్ సింగ్ కుటుంబ సమేతంగా బందువుల ఇంటిలో జరిగిన రిసెప్షన్ కు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు అజిత్ సింగ్ ఇంటి తాళాలు పగులగొట్టి, పడక గదిలో బీరువా ద్వంసం చేసి ఐదు తులాల బంగారం, 80 వేల నగదు చోరి చేశారు. ఉదయం వేళ ఇంటితాళా లు పగుల గొట్టిన విషయం తెలిసి అజీత్ సింగ్ కుటుంబానికి సమాచారం అందడంతో బాధితులు పోలిసులకు పిర్యాదు చేశారు. రెండవ టౌన్ పోలీసులు ఘటన స్థలం చేరుకుని విచారణ చేపట్టారు.

# 45 రోజుల్లో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**- రేగొండ మండలంలో నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ**

**- మహాశివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి**



**భూపాలపల్లి, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** 45 రోజుల్లో ఇందిరమ్మ మోడల్ నిర్మాణ పనులను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను 45 రోజుల్లో పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిని అంచనా వేశారు. ఇంటి నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ మోడల్ హౌసింగ్ పథకం ద్వారా పేదలకు మంచి గృహాలు అందించడమే లక్ష్యమని తెలిపారు. పనుల్లో ఆలస్యం లేకుండా, నాణ్యతతో కూడిన నిర్మాణం జరగాలని అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, డిఆర్డీఓ నరేష్, తహసీల్దార్ శ్వేతా, ఎంపిడిఓ వెంకటేశ్వ రావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో మహాశివరాత్రి వేడుకలపై దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యూఎస్, వైద్య, ఇరిగేషన్,మత్స్య, విద్యుత్, ఆబ్కారీ, సింగరేణి, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన కాళేశ్వర శ్రీ ముక్తేశ్వర స్వామి దేవాలయంలో జరిగే మహా శివరాత్రి వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నదని అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మహా శివరాత్రి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలయాలను దర్శించుకునే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రమైన త్రాగునీటి సరఫరా, వైద్యం, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆలయ ప్రాంగణాల్లో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలని పేర్కొన్నారు. కుంభాభి షేకం మహొత్సవాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు బాగా చేశారని సంబంధిత శాఖల అధికారులను, సిబ్బందిని అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా నియంత్రణ చేయాలని, ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే గజ ఈతగాళ్ళు ను అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున మన డిపో నుండే కాకుండా ఇతర డిపోల నుండి అధికంగా బస్సులు నడపాలని డిఎం కు సూచించారు. సింగరేణి సంస్థ ద్వారా రెస్క్యూ టీము ఏర్పాటు చేయాలని తెలిపారు. పండుగ రోజుల్లో 48 గంటలు మద్యం విక్రయాలు నిలుపుదల చేయాలని, పటిష్ట పర్యవేక్షణ చేయాలని ఆబ్కారీ అధికారు లను ఆదేశించారు. తాత్కాలిక. మరుగుదొడ్లు,భక్తులు బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారు లను ఆదేశించారు. అభిషేకం దర్శన సమయంలో భక్తులు క్రమ పద్ధతి పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దేవాలయాన్ని విద్యుద్దీ కరణ, పూలతో ముస్తాబు చేయాలని దేవస్థానం అధికారులకు సూచించారు. వాహనాలు క్రమబద్దీకరణకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి నిర్దేశించిన ప్రాంతంలో భక్తులు వాహనాలు నిలుపుదల చేయు విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పటిష్ట పోలిస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అనంతరం మహా శివరాత్రి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సింగరేణి జిఎం రాజేశ్వర రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణ రావు, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్హూర్ నాయక్, మత్స్య శాఖ అధికారి అవినాష్, దేవస్థానం ఈఓ మహేష్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి జన్మదిన వేడుకలు



**ఖమ్మం, ఫిబ్రవరి19( నినాదం న్యూస్):** పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్ ను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఎంపీ క్యాంపు కార్యాలయంలో కేక్ ను అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పద్మశ్రీ వనజీవి రామయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ లతో కలిసి ఈ సందర్భంగా వారు ప్రసంగించారు. ఎంపీగా రఘురాం రెడ్డి గారు జిల్లాలో చెరగని ముద్ర వేస్తున్నారని అన్నారు. మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ..లి అశేష మెజారిటీతో గెలిచిన ఎంపీ రఘురాం రెడ్డి గారు జిల్లా సమగ్ర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై పార్లమెంటులో గళం విప్పి ప్రశ్నిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ జిల్లా నేత కొప్పుల చంద్రశేఖర్ మాట్లాడుతూ. గొప్ప విద్యావేత్త అయిన రఘురాం రెడ్డి గారు.. కొత్తగూడెం ఎయిర్ పోర్ట్, ఖమ్మంలో అతిపెద్ద గ్రంథాలయం, ఇతర అభివృద్ధి పనుల కోసం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. నిరంతరం ప్రజల బాగుకోసం పరితపిస్తున్నారని చెప్పారు. పలు సేవా కార్యక్రమాలు.. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, పెద్దతండా, కరుణగిరి మానసిక వికలాంగుల కేంద్రాల్లో కార్పొరేటర్ ఎండి ముస్తఫా రఫీదా బేగం ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్చార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో.. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధా కిషోర్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, సీనియర్ నాయకులు సోమనాథం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బెల్లం శ్రీను, మట్టె గురవయ్య, కార్పోరేటర్లు, సీనియర్ న్యాయవాది స్వామి రమేష్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఐతం రవీందర్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, యాస వెంకటేశ్వరరావు, మచ్చా రామారావు, ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీను, నాయకులు దీపక్ చౌదరి, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, కాంగ్రెస్ మహిళా, యువజన సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ వామపక్షాల నాయకుల నిరసన



**ఆళ్లపల్లి, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):** ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కార్మిక,ప్రజావ్యతిరేక బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ వామపక్షాల పిలుపుమేరకు బుధవారం మండల కేంద్రంలో భగత్ సింగ్ సెంటర్లో నిరసన తెలిపారు. సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు మెస్సు గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య,సిపిఐ (ఎం-ఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కొక్కు సారంగపాణి,సిపిఐ (ఎం-ఎల్)మాస్ లైన్ మండల నాయకులు ఈసం సమ్మన్న పాల్గొని మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులున్నప్పటికీ నిధులు రాబట్టుకోవడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు.ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని,సబ్సిడీలు పెంచాలని,రాష్ట్రాలకు నిధులు బదిలీ పెంచాలని డిమాండ్ చేశారు.భీమా రంగంలో 100% ఎఫ్డిఐ ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.దేశంలో 200 మంది సంపన్నులపై నాలుగు శాతం సంపద పన్ను పెంచాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక బడ్జెట్ ను ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి వజ్జ పగడయ్య,నాయకులు కుంట సహాదేవ్, రేసు సురేందర్, నరేష్, మద్దెల వెంకటేశ్వర్లు, కండె రాంబాబు, నాతి దుర్గేష్, గణేష్, కొమ్మ శ్రీను, సిపిఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బట్టు ప్రసాద్, డివిజన్ నాయకులు బత్తిని సత్యం,మండల నాయకులు సుభద్ర, వాగబోయిన రాంబాబు,మోకాళ్ళ శేఖర్, సిపిఐ(ఎం-ఎల్)మాస్ లైన్ మండల నాయకులు జోగ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి జన్మదిన వేడుకలు



**పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 19(నినాదం):** దేశాన్ని సనాతన హిందూ భారతదేశంగా ప్రకటించాలని బజరంగదళ్ నాయకులు అన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి మండల నిమ్మనపల్లి గ్రామంలో బుధవారం శోభాయాత్ర బైక్ ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా ప్రముఖ వేదపండితులు కొండపాక శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ, తల్లి జిజియాభాయి స్ఫూర్తి,తనదేశం పట్ల మమకారం శివాజీని వీరుడిగా మలిచాయని,అలాంటి శివాజీలు ప్రస్తుతం ప్రతీ ఇంట్లో పుట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. భారత్ ను సనాతన హిందూదేశంగా ప్రకటించిననాడే భవిశ్యత్ తరాలకు సనాతన ధర్మ శ్రద్ధా గుణాలను అందించగలుగుతామన్నారు. హిందువుల పట్ల,హిందూ పండగలు, వేడుకలు, కుంభమేళాల పట్ల విషాన్ని వెల్లగక్కుతున్న వారిని దేశం నుండి తరిమివేస్తామని శ్రీనివాసాచార్యులు స్పష్టం చేశారు.హిందూద్రోహ రాజకీయపార్టీల పట్ల హిందువులు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో నాయకులు వేల్పుల రమేష్,వేల్పుల చందన్,అట్లా మధుకర్, వేల్పుల మనోజ్,సందనవేని శ్రీనివాస్,వేల్పుల అభినవ్, ఎత్తిరాజు మధు,బండారి అజయ్,వేల్పుల రాజు,అజయ్,రిషిత్ ఆకాష్ పాల్గొన్నారు.

## నూతన కమిటీ నియామకం

**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):**



తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం నస్పూర్ పట్టణ నూతన కమిటీని శ్రీరాం పూర్ లో బుధవారం ఎన్నుకున్నారు. మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిం చారు. నస్పూర్ పట్టణ అధ్యక్షుడు వాసు, ఉపాధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి పర్లపల్లి సారయ్య, ప్రచార కార్యదర్శి విజయ్, సలహాదారులు లక్ష్మీనారాయణలను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగ్, జిల్లా అధ్యక్షుడు తలారి రాజు నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని, మహనీయుల జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని పేర్కొన్నారు.

## ఇంజక్షన్ రియాక్షన్‌తో వ్యక్తి మృతి..?

### - వైద్యుడు లేకుండానే కాంపౌండర్ల వైద్యం...
### - విరోచనాలతో అస్వస్థతకు గురై మృతి...
### - ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన...?

**కోదాడ, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):**
వైద్యుడు లేకుండానే కాంపౌండర్ లు వైద్యం చేయడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన కోదాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బుధవారం చోటుచేసుకుంది. హుజూర్నగర్ మండలం బూరుగడ్డ గ్రామానికి చెందిన గూడెపు నాగేశ్వరావు (48) అనే వ్యక్తి అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. మొదట వైద్యుడు పరిశీలించిన అనంతరం స్కానింగ్ రక్తపరీక్షలకు ప్రిఫర్ చేశాడు. ఈ క్రమంలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో రిపోర్టులను సదరు కాంపౌండర్లు చరవాణి ద్వారా వాట్సాప్ కు పంపించడంతో డాక్టర్ వాట్సప్లో పంపించా నేపథ్యంలో డాక్టర్ ఇంజక్షన్ ఇచ్చే ట్రీట్మెంట్ చేయవలసిందిగా చెప్పడంతో, కాంపౌండర్లు ఇంజక్షన్ చేయడంతో వికటించి విరోచనాలతో మృతి చెందినట్లుగా బంధువుల ఆరోపిస్తున్నారు. కానీ సీరియస్ గా ఉంది వేరే హాస్పటల్ కు తరలించమని బంధువుల తెలపడంతో వారు పట్టణంలోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్



**ధర్మారం ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్)**
ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా మండలంలోని పత్తిపాక గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ రోజు ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా వారు మాట్లడుతూ. మరాఠా యోధుడు,జాతి వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆ మహాయోధుడికి ఘనంగా నివాళులు అర్పింస్తున్నమని,మొఘలుల బారి నుండి భారతదేశాన్ని కాపాడటంలో శివాజీ మహరాజ్ చేసిన పోరాటం మరువలేనిదని, ధైర్యసాహసాలకు ప్రతీకగా శివాజీ  నిలిచారని,ఆనాడు శివాజీ మహారాజ్ చెప్పిన స్ఫూర్తిదాయకమైన మాటలు నేటి యువతరానికి మార్గదర్షణీయమని, ఇంతటి మహనీయుడి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నన్ను బాగస్వాముడిని చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యాలాల మహేశ్వర్ రెడ్డి తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి

**చేవెళ్ల ఫిబ్రవరి 19(నినాదం న్యూస్):**
కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లవాడ మాజీ ఎంపిటీసి యాలాల మహేశ్వర్ రెడ్డి తండ్రి యాలాల పెద్ద వెంకట్ రెడ్డి గారు రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం డీకొని మృతి చెందారు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో గుండాల గేటు సమీపంలో చేవెళ్ల కు వచ్చే క్రమంలో నడుచుకుంటూ రోడ్డు వైపున వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. హుటాహుటిన అతన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అక్కడ నుండి మహేందర్ రెడ్డి ఆసుపత్రికి తరలించగా మార్గ మద్యం లోనే అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి లో పోస్టు మార్టం మృత దేహాన్ని ఉంచారు.

## వినయ్ నగర్‌లో నేడు సేవాలాల్ మహారాజ్ జయంతి
## 286 కార్యక్రమం జయప్రదం చేయండి

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్ పిలుపు**

**మహేశ్వరం, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):**



హైదరాబాద్ యాకుత్ పురా నియోజకవర్గం సైదాబాద్ మండలం డివిజన్ సంతోష్ నగర్ ఐ.ఎస్ సదన్ డివిజన్ పరిధిలోని నేడు గురువారం 3 గంటలకు వినయ్ నగర్ పరిధిలోని వినయ్ నగర్ కమ్యూనిటీ హాల్ లో అత్యంత వైభవంగా జరిగే  సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమం జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాకత్పురా నియోజకవర్గ గల అన్ని గిరిజన ప్రాంతాలలో సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి పురస్కరించుకొని కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్ని గిరిజన ప్రాంతాల్లో బస్తీలలో, కాలనీలలో జరిగే జయంతి కార్యక్రమాలకు పార్టీలకు అతీతంగా సంఘాలకు అతీతంగా పెద్దలు హాజరవుతారని సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి చారిత్రక సందేశాన్ని తెలియజేస్తారని సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు కార్యక్రమాలు నిర్వహిస్తారు కావున ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ఛత్రపతి శివాజీ
## భారతీయులందరికి ఆదర్శప్రాయుడు

### – పీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్

**మహేశ్వరం, ఫిబ్రవరి 19 (నినాదం న్యూస్):**
నిస్వార్థంగా ప్రజలకు సేవచేయడం, చేసే పనిపట్ల అంకితభావం, మచ్చలేని వ్యక్తిత్వం ప్రజల ఆకాంక్షమేరకు పాలన సాగించిన ఛత్రపతి శివాజీ, భారతీయులందరికి ఆదర్శప్రాయుడని, పీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో మరాఠా యోధుడు ఛత్రపత్రి శివాజీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హజరై, శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ వీరత్వానికి ప్రతీక, ఆయన పౌరుషం, అన్యాయాన్ని ఎదురించే సాహసం మనకు ఆదర్శమని అన్నారు. జీవితంలో సమస్యలు, కష్టాలు వస్తే వాటిని చూసి అధైర్యపడకుండా, ధైర్యంతో పోరాడి వాటిని ఎదుర్కొనే ధైర్యాన్ని ఛత్రపతి నుంచి పొందాలని పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ స్వరాజ్యం కోసం, ధర్మ స్థాపన కోసం ఎన్నో పోరాటాలు చేశారని, అలాంటి వీరుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత యువత శివాజీ అడుగు జాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్అలీ, నాయకులు మల్లేశ్ గౌడ్, హీరాసింగ్, సత్యంయాదవ్, లక్ష్మయ్య, తులసీరాం భక్తులు అభిమానులు పెద్దలు కార్యకర్తలు సభ్యులు తదితరులు ఉన్నారు.